క్లుప్తంగా

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి

● ఎంపీపీ గుమ్మా పద్మజ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాసర్‌రెడ్డి

పెద్దదోర్నాల: గ్రామీణ ప్రాంతాల్లో అపరిష్కృతంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ గుమ్మా పద్మజ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు సంబంధించిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే



తాళ్లూరులో సర్వే చేస్తున్న అధికారులు

తాళ్లూరు: మండలంలోని తాళ్లూరులో మండల స్థాయి అధికారులు స్వామిత్వ సర్వే చేస్తున్నారని ఎంపీడీఓ సుందరరామయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇళ్లు కలిగిన ప్రతి ఒక్కరూ స్వామిత్వ సర్వే ద్వారా ఇళ్లు సులువుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని చెప్పారు. అధికారులు ప్రతి ఇల్లు తిరిగి స్వామిత్వ సర్వే చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, భాస్కర్, హనుమంతరావు, రామారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి

దర్శి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుగ్గిరెడ్డి రమణారెడ్డి (56) బుధవారం మృతి చెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. అందరితో కలుపుగోలుగా ఉండే ఆయన మృతికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు..

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కురిచేడు: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు తెలిపారు. మండలంలోని ఆవులమంద, కల్లూరు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ క్వింటాకు రూ.2320, మామూలు రకం క్వింటాకు రూ.2300 తెలిపారు. తేమ 17 శాతం ఉండాలన్నారు.

దర్శి: వరి ధాన్యం రైతు సేవా కేంద్రాల్లో అమ్ముకోవాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని శామంతపూడి రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ రైతులంతా వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ సబ్సిడీలు పొందాలని సూచించారు. పండించిన వరి ధాన్యం మార్కెట్‌లో గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలన్నా పంట నమోదు అవసరమన్నారు. క్షేత్రస్థాయిలో తెగుళ్లు, పంటలపై ఆశించే చీడపీడలపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఏఓ బాలకృష్ణ నాయక్, డి.అరుణ, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు వంద రోజులు

● పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు
● ఆ దిశగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల కసరత్తు
● ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు


పుల్లలచెరువు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. డిసెంబర్ 1 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక దోహదపడుతుంది. మార్చి 17 నుంచి పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది.

ఇవీ..మార్గదర్శకాలు

పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం. అదనపు తరగతుల నిర్వహణ, నిత్యం చిన్న, చిన్న పరీక్షలు పెట్టడం, అవసరమైన పాఠ్యాంశాలను పునశ్చరణ, వార్షిక పరీక్షల తరహాలో నమూనా పరీక్షలు నిర్వహించి వారిలో భయాన్ని పోగొట్టడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణకు వీలుగా ప్రతి విద్యార్థి జవాబు పత్రాలు, సాధించిన మార్కుల పత్రాలను భద్రపరచడం, రానున్న పరీక్షల సన్నద్ధతకు కూడా ఇవి దోహదపడే అవకాశంపై విద్యార్థులకు చెప్పడం. రోజు ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్టు వంతున వారానికి 7 సబ్జెక్టులను బోధిస్తున్నారు.

వై.పాలెం నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
పుల్లలచెరువు	8	400
త్రిపురాంతకం	14	779
పెద్దారవీడు	12	589
యర్రగొండపాలెం	21	972
పెద్దదోర్నాల	11	610



ప్రత్యేక తరగతుల్లో పుల్లలచెరువు జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు

సిలబస్ రివిజన్‌కు అవకాశం:



ఉదయం, సాయంత్రం రోజుకు ఒక్క సబ్జెక్టు చొప్పున ప్రత్యేక తరగతులతో ఆశించిన స్థాయిలో మార్కులు సాధించే అవకాశం ఉంది. సిలబస్ రివిజన్‌కు మంచి అవకాశం ఏర్పడింది. ప్రత్యేక తరగతులతో ఎక్కువ సమయం పాఠశాల వద్ద ఉండటం వల్ల ఆయా సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉంటున్నారు. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– ఎం.మనోహర్, పది విద్యార్థి, పుల్లలచెరువు

యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు



అన్ని ప్రభుత్వ హైస్కూల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేస్తున్నాం. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పదో తరగతి బ్లూప్రింట్ ప్రకారం ప్రీఫైనల్, గ్రాండ్ టెస్టు నిర్వహిస్తాం. సంక్రాంతి పండగ మూడు రోజులు మినహా అన్ని సెలవు దినాల్లో ప్రత్యేక తరగతులు కేటాయించిన సబ్జెక్టు టీచర్లతో నిర్వహించేలా కృషి చేస్తున్నాం.

– ఇందిర, ఎంఈవో, పుల్లలచెరువు

ప్రత్యేక తరగతులతో మేలు:



ప్రత్యేక తరగతులతో మరింత సమయం చదువుకునే అవకాశం ఉంటుంది. మాకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. సిలబస్ రివిజన్ చేస్తున్నారు. సాయంత్రం సమయంలో స్కూల్ నుంచి ఇంటికి వెళ్లిన వెంటనే ఆటలపై దృష్టి పడుతుంది. ఇక్కడే ఉండి చదువుకోవడంతో తోటి విద్యార్థులతో పోటీ పడి నేర్చుకుంటున్నాం. స్లిప్ పరీక్షల్లో మంచి మార్కులు వచ్చాయి. విద్యార్థుల మధ్య చదువుకుంటే పోటీతత్వం పెరిగి మరింతగా చదువుకుంటాం.

– కె.లీలావతి, పది విద్యార్థిని, పుల్లలచెరువు జెడ్పీ హైస్కూల్

రేపు పాస్టర్‌లకు బూచేపల్లి దుస్తుల పంపిణీ

దర్శి: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఐదు మండలాల పాస్టర్‌ల దంపతులకు దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు దుస్తులు పంపిణీ చేయనున్నారు. స్థానిక బూచేపల్లి నివాసంలో 20వ తేదీ ఉదయం 10 గంటలకు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి అనంతరం దుస్తులు పంపిణీ చేస్తారు.

నియోజకవర్గంలోని పాస్టర్‌ల దంపతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మలు కోరారు.

కేవీరెడ్డి సేవలు అభినందనీయం



వాటర్ క్యాన్‌లు అందజేస్తున్న కేవీరెడ్డి

● తూర్పు చౌటపాలేనికి వాటర్ ప్లాంట్ వితరణ

దర్శి: మండలంలోని తూర్పు చౌటపాలెం గ్రామానికి వాటర్ ప్లాంట్ బహూకరించిన రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కేవీరెడ్డి సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ గవర్నర్ శరత్ చౌదరి పేర్కొన్నారు. బుధవారం తూర్పు చౌటపాలెంలో డెక్కన్ క్లబ్,, కేవీరెడ్డిలు సంయుక్తంగా గ్రామస్తుల తాగునీటి అవసరాల కోసం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 60 మంది మహిళలకు కేవీరెడ్డి వాటర్ క్యాన్‌లు బహూకరించారు. వాటర్ ప్లాంట్‌ను శరత్ చౌదరి, ప్రాజెక్ట్ చైర్మన్ మురళీ ప్రసాద్‌లు ప్రారంభించారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. శరత్ చౌదరి మాట్లాడుతూ సమాజ సేవ కోసం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పని చేసిన కేవీరెడ్డి తన స్వగ్రామం తూర్పు చౌటపాలెం గ్రామానికి తాగునీరు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారని చెప్పారు. గ్రామంలో ఇలాంటి దాతలు ఉండటం గ్రామాలకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. కేవీ రెడ్డి మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ మెయింటెన్స్ కోసం రూ.5కే శుద్ధి చేసిన నీటిని అందించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పానుగంటి కోటేశ్వరరావు, సెక్రటరీ బి.నాగేశ్వరరావు, ట్రెజరర్ అంబవరపు నారాయణరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు సోము దుర్గారెడ్డి, రెడ్డిమాసు శ్రీను, చెవిరెడ్డి రాజారెడ్డి, ఎదురు నారాయణరెడ్డి, అలవల అంజిరెడ్డి, వెన్నపూస పేరిరెడ్డి, కర్ణా రమణారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళలు శిక్షణ పొంది వ్యాపారులుగా మారాలి

● చిరుధాన్యాలతో బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న కేవీకే హెడ్ రమేష్

దర్శి: కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొంది మహిళలు వ్యాపారులుగా మారాలని కేవీకే హెడ్ డాక్టర్ జి.రమేష్ అన్నారు. చిరుధాన్యాలతో బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి.మానస బుధవారం ఇచ్చారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లా మహిళా రైతులతో రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిరుధాన్యాలకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. తయారు చేసిన ప్రతి తినుబండారం పోషక విలువలతో కూడుకున్నదని తెలిపారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మహిళలు ఖాళీగా ఇంటి వద్ద ఉండకుండా చిరుధాన్యాలతో ఇంట్లోనే బేకరీలో లభించే తినుబండారాలను తయారు చేసుకునే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. తమకు తాముగా స్వయంగా చిరుధాన్యాలతో బేకరీ ఉత్పత్తులు చేసుకుంటే చిరుధాన్యాల వినియోగాన్ని పెంచుకుంటూ ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవచ్చని వివరించారు. చిరుధాన్యాలను డైరెక్టర్‌గా ఆహారంగా తీసుకోవడం కంటే చిన్న చిన్న స్నాక్స్‌గా తయారు చేసుని కుటుంబ సమేతంగా తినేందుకు ఎక్కువ మక్కువ చూపుతారన్నారు. మహిళలు ఒక సమూహంగా ఏర్పడి చిరుధాన్యాలతో బేకరీ ఐటమ్స్ చేసుకుంటే స్వయం సమృద్ధిగా ఎదిగేందుకు దోహదపడుతుందని వివరించారు. ఎస్టీఓ డీపీఆర్‌సీ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

దొనకొండ: గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం 3వ రోజు మండల స్థాయి అధికారులకు, సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక చాలా ముఖ్యమని, గ్రామాలు ప్రగతికి పట్టుకొమ్మలన్నారు. పంచాయతీ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి పని చేసినప్పుడే పంచాయతీ కుంటు పడకుండా అభివృద్ధి చెందుతున్నారు.

రోటరీ సేవలు అభినందనీయం



కుట్టు మిషన్‌లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

● మహిళలకు 25 కుట్టు మిషన్‌ల పంపిణీ

దర్శి: పట్టణంలో రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి పేర్కొన్నారు. కురిచేడు రోడ్డులోని ఎస్‌టీఆర్ మార్కెటింగ్ వద్ద 25 మంది పేద మహిళలకు బుధవారం 25 కుట్టుమిషన్‌లు బహూకరించారు. ఈ సందర్భంగా శరత్ చౌదరి మాట్లాడుతూ పేద మహిళలను గుర్తించి వారి జీవనాధారం మెరుగు పరుచుకోవాలని రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా కుట్టు మిషన్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. పేద మహిళలు వాటి ద్వారా జీవనోపాధి పొంది సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పానుగంటి కోటేశ్వరరావు, సెక్రటరీ బి.నాగేశ్వరరావు, ట్రెజరర్ అంబవరపు నారాయణరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు సోము దుర్గారెడ్డి, రెడ్డిమాసు శ్రీను, డాక్టర్ భవనం కోటిరెడ్డి, అలవల అంజిరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల రామాలయాల్లో ధనుర్మాస పూజలు మూడో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడివరం రామాలయంలో పూజారి శంకు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పుల్లలచెరువులో భక్తులు రామాలయంలో పూజలు చేసి నగర సంకీర్తన చేశారు. గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెంచుల కుల నిర్ధారణపై అధికారుల విచారణ



చెంచులను విచారిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

పెద్దారవీడు: మండల పరిధిలోని రాజంపల్లిలో నివసించే చెంచుల కుల నిర్ధారణపై మార్కాపురం సబ్ కలెక్టర్ బీఎస్ వెంకట త్రివినాగ్, డీటీడబ్ల్యూఓ రాజేశ్వరి, ఐటీడీఏ ఏపీఓ సురేష్‌బాబులు బుధవారం విచారణ చేపట్టారు. రాజంపల్లిలో నివసిస్తున్న చెంచులు ముత్తరాశి కులస్తులని, వీరంతా చెంచులుగా చలామణి అవతున్నారని కలెక్టర్, లోకాయుక్తకు గతంలో కొందరు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు చెంచులను అధికారులు విచారించారు. చెంచులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో దళిత నేత నీలం నాగేంద్రరావు, మాల మహానాడు ప్రధాన కార్యదర్శి కాకుమాను రవి, దళిత నాయకులు మాల పోలు శాంతకుమార్, మాజీ సర్పంచ్ జిల్లా రామారావు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

● 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కొత్తూరు గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం విస్తృత దాడులు నిర్వహించారు. భారీగా నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేయటంతో పాటు సారా తయారీకి వినియోగించే డ్రమ్ములను సైతం స్వాధీనం చేసుకున్నారు. దాడులకు సంబంధించి మార్కాపురం ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని కొత్తూరు పరిసర ప్రాంతాల సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే డ్రమ్ములను సైతం స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో చట్ట వ్యతిరేక చర్యలను పూర్తిగా నిర్మూలిస్తామని వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

పదో తరగతి టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

దర్శి: పదో తరగతి టాలెంట్ టెస్టును జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మీనిగ శ్రీనివాసరావు కోరారు. టాలెంట్ టెస్ట్ కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే ఉద్దేశంతో టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ప్రశ్నపత్రాలను రూపొందించామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.విజయ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్నీ మండల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి విజేతలకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తామని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే కాలేషావలి, యూటీఎఫ్ కాంప్లెక్స్ చైర్మన్ పి.రంగారావు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఏవో మాల్యాద్రి

పుల్లలచెరువు: కంది, మిరప పంటల్లో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని ఎరువులు, మందులు వాడితే అధిక దిగుబడులు సాధించే వెసులుబాటు కలుగుతుందని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మాల్యాద్రి తెలిపారు. బుధవారం మండలంలోని పుల్లలచెరువు, గంగవరం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో కంది, మిరప పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. కంది పంటను సాగు చేసిన రైతులు తమ పేర్లు ఆర్బీకేల్లో నమోదు చేసుకుంటే త్వరలో ఏర్పాటు చేసే కందుల కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు చేసుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం మిర్చి పంటలో నల్ల తామర పురుగు ఆశించినట్లు గుర్తించామని, పురుగు నివారణకు పొలం గట్లపై ఉన్న కలుపు పూర్తిగా తీసి వేసి అంతర్ కృషి చేసుకోవాలన్నారు. నీలిరంగు, ములుగు రంగు అట్టలను పొలాల్లో 40 ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వేపనూనె లీటరుకు 5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. డెలిగేట్, ట్రేసర్, తాకత్ లాంటి మందులు వాడితే తామర పురుగులను నివారించవచ్చని చెప్పారు. సిబ్బంది గోపీకృష్ణ, బ్రహ్మయ్య, కిరణ్‌నాయక్ పాల్గొన్నారు.

సదస్సులతో విద్యార్థుల చదువుకు మంగళం



కంభంపాడు ఎంపీపీ పాఠశాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు

పెద్దారవీడు: గ్రామ రెవెన్యూ సదస్సుల పుణ్యామని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు అవి అడ్డంకిగా మారాయి. అధికారుల తీరు విద్యార్థుల చదువుకు మంగళం పాడేలా ఉంది. మండలంలో ప్రభుత్వం నిర్వహించే సమావేశాలకు అన్ని సౌకర్యాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాలు నిర్మించింది. కొన్ని గ్రామాల్లో అద్దె భవనాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి అధికారులు వాటిల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కంభంపాడులో అద్దె భవనంలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 10వ తేదీన ఎంపీపీ పాఠశాలలో, 17వ తేదీన ప్రగళ్లపాడులో రచ్చబండ వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించకుండా ఎంపీపీ పాఠశాలలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. చట్లమిట్ల, రేగుమానిపల్లె గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు ఉన్నాయి. 19వ తేదీన చట్లమిట్ల, 21వ తేదీన తంగిరాలపల్లి, 24వ తేదీన తోకపల్లి, 26వ తేదీన పాతంపల్లి, జనవరి 4, 7వ తేదీల్లో ఓబులక్కపల్లి గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు షెడ్యూల్ ప్రకటించిన విషయం తెల్సిందే. ప్రభుత్వ పాఠశాలల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుండటంతో తరగతులు నిర్వహించలేని పరిస్థితి. ప్రజలు తమ సమస్యలపై గోలగోలగా మాట్లాడుతున్నారని విద్యార్థులు చెబుతున్నారు. చదువుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, నాయకుల ప్రసంగాలు, ప్రజల హడావుడితో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థంగాక మనసు పక్కదారి పడుతుందని విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయాలు ఉన్న గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు వాటిల్లో నిర్వహించే అవకాశం ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలగకుండా పంచాయతీ కార్యాలయాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న క్రిస్మస్ తారలు

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. దీనిలో భాగంగా పలు గ్రామాల్లోని చర్చిల వద్ద, ప్రధాన రహదారుల్లో యువత రంగు రంగుల క్రిస్మస్ తారలు ఏర్పాటు చేస్తున్నారు. చర్చిలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. రాత్రి వేల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించి దైవ సందేశం వినిపిస్తున్నారు.



ముటుకుల రహదారిపై ఏర్పాటు చేసిన క్రిస్మస్ తార